## క్లుప్తంగా

### మంత్రి హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే రమేశ్‌బాబు



మంత్రి హరీశ్‌రావుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

**వేములవాడ:** వేములవాడ నియోజకవర్గంలో వైద్య రంగంలో చేపట్టాల్సిన పనులను మంత్రి హరీశ్‌రావుతో కలసి శుక్రవారం చర్చించినట్లు ఎమ్మెల్యే రమేశ్‌బాబు తెలిపారు. వైద్య రంగంలో ప్రతిపాదనలు, కొత్తగా పల్లె దవాఖానాలు, కొత్త మండలాలకు మంజూరైన 30 పడకల ఆసుపత్రులపై చర్చించినట్లు తెలిపారు. ఎల్లంపల్లి మిగులు పనులకు రూ.42 కోట్లు నిధులు ఇవ్వాలని, ముంపు గ్రామాల సమస్యలను పరిష్కరించేందుకు రూ.15 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

### అనుమతి లేకుండా నిర్మాణం

- అధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు



రోడ్డు పక్కనే జరుగుతున్న మిల్లు నిర్మాణం

**కోనరావుపేట:** రహదారికి పక్కనే మిల్లుకు సంబంధించిన పనులు జరుగుతున్నా, సంబంధిత అధికారులు కూడా చూసీచూడనట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలం ధర్మారం గ్రామ శివారులో ఓ రైస్‌మిల్లు నిర్మాణం దాదాపు పూర్తయింది. మిల్లుకు సంబంధించిన వే్‌బ్రిడ్జిని రహదారికి ఆనుకుని నిర్మిస్తుండడంతో కొందరు గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పనులు నిలిపివేశారు. మిల్లుకు సంబంధించిన నిర్మాణాన్ని ప్రధాన రహదారికి 33 ఫీట్ల దూరంలో నిర్మించాల్సి ఉండగా, 20 ఫీట్ల దూరంలోనే నిర్మిస్తుండడంతో ఫిర్యాదు చేస్తున్నారు. ప్రస్తుతం 12 ఫీట్ల రహదారి భవిష్యత్తులో విస్తరించే అవకాశం ఉందని, అధికారులు స్పందించి నిర్మాణాన్ని కనీస దూరంలో కట్టుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై కోనరావుపేట ఎంపీవో రాజును వివరణ కోరగా ఎలాంటి అనుమతి లేకుండా వే్‌బ్రిడ్జి నిర్మిస్తున్నారని, అదీ రోడ్డుకు దగ్గరగా కడుతున్నట్లు దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

**ముస్తాబాద్:** స్థానిక క్రేజీ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతలకు జెడ్పీటీసీ గుండం నర్సయ్య బహుమతి ప్రదానం చేశారు. అంతకు ముందు ఎస్సై వెంకటేశ్వర్లు పోటీలను ప్రారంభించారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్, సంఘం అధ్యక్షుడు దుబ్బాక రాజు పాల్గొన్నారు.

# వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- సభ్యుల ప్రశ్నల వర్షంతో అధికారులు ఉక్కిరిబిక్కిరి
- తంగళ్లపల్లి మండల సభలో సాయిచంద్ మృతికి సంతాపం




మాట్లాడుతున్న ఎంపీపీ మానస

**తంగళ్లపల్లి:** తంగళ్లపల్లి మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు, అధికారులపై ప్రశ్నల వర్షంతో ఉక్కిరిబిక్కిరి చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ పడిగెల మానస అధ్యక్షతన నిర్వహించిన సమావేశం వాడివేడిగా సాగింది. ముందుగా రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ సాయిచంద్ మృతిపై సభ్యులు సంతాపం ప్రకటించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వివిధ శాఖల అధికారులను ప్రగతి నివేదిక చదివి వినిపించారు.

➡ గతేడాది పంట నష్టం ఇంకా రైతులకు రాలేదని బాలమల్లుపల్లె, బస్వాపూర్, ఎడ్లవానికుంట గ్రామాల్లో పంట నష్టం ఎప్పుడు వస్తుందని ఎంపీటీసీ బైరినేని రాము అన్నారు.

➡ అంకిరెడ్డిపల్లె, దేశాయిపల్లె గ్రామాల్లో మార్చి నెలలో 40 శాతం పైగా పంట నష్టం జరిగితే ఎందుకు నమోదు చేయలేదని ఎంపీటీసీ రాగుల రాజురెడ్డి ప్రశ్నించగా, 33 శాతంకు పైగా పంట నష్టం జరిగితేనే నష్టపరిహారం ఇచ్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారి సందీప్ తెలిపారు.

➡ రాళ్లపేటలో ప్రభుత్వ ఉపాధ్యాయులు సరిగా రావడం లేదని సర్పంచ్ పర్శరాములు సభ దృష్టికి తీసుకువచ్చారు.

➡ మన ఊరు మన బడిలో 15 గ్రామాలకు కిచెన్ షెడ్లు, టాయిలెట్లు, కాంపౌండ్ వాల్ మంజూరు అయ్యాయని, మిగిలిన పాఠశాలల్లో టాయిలెట్లు కట్టాలని కలెక్టర్ ఆదేశించినట్లు ఎంపీడీవో పి.లచ్చాలు తెలిపారు.

➡ గ్రామపంచాయతీల్లో మాన్యువల్ మ్యుటేషన్ చేసుకుంటే ఆన్‌లైన్ కావడం లేదని పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ చెన్నమనేని వెంకట్రావు తెలిపారు.

➡ తాను 135 పెన్షన్ దరఖాస్తులు ఇస్తే కేవలం 75 మందికి మాత్రమే మంజూరయ్యాయని, అలాగే డిప్యుటేషన్‌పై వెళ్లిన టైపిస్టును తిరిగి తీసుకురావాలని అంటూ, జెడ్పీ సీఈవో చెప్పినా టైపిస్టు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీడీవో పి.లచ్చాలు, తహసీల్దార్ పి.సదానందం, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు కొమ్మిటి రాజిరెడ్డి, వైస్‌ఎంపీపీ జంగిటి అంజయ్య, ఇన్‌చార్జి ఎంపీవో విజయేందర్‌రెడ్డి, ఏపీవో నాగరాజు, మెడికల్ అధికారులు రేఖ, రామకృష్ణ, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ భూలక్ష్మి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు మాట్ల మధు, వలకొండ వేణుగోపాలరావు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు చెన్నమనేని వెంకట్రావు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## పవర్ కట్

### విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఎల్లారెడ్డిపేట:** మండలంలోని బండలింగంపల్లి గ్రామ శివారులో విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్లను నరికివేసే కార్యక్రమం ఉన్నందున శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఈ దివ్య ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపూర్, కొండాపూర్ రెండు గ్రామాల పరిధిలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాలో అంతరాయానికి రైతులు, వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.

## సమాచారం

### హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**సిరిసిల్లటౌన్:** జిల్లా కేంద్రంలోని గీతానగర్ ఎస్సీ గర్ల్స్ హాస్టల్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వార్డెన్ పరకాల విజయలక్ష్మి ఒక ప్రకటనలో కోరారు. హాస్టల్‌లో ఉంటూ చదివే విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటుగా నాలుగు జతల దుస్తులు, రెండు దుప్పట్లు, చెప్పులు, బూట్లు, తదితర వస్తువులు ఉచితంగా అందించబడుతాయన్నారు. గ్రామీణ విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## ప్రజా గాయకుడు సాయిచంద్‌కు నివాళి



సిరిసిల్లలో నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్ కళ



వేములవాడఅర్బన్: కళాకారులు..



ముస్తాబాద్‌లో నాయకులు..

**సిరిసిల్లటౌన్/సిరిసిల్లఅర్బన్/ముస్తాబాద్/వేములవాడఅర్బన్:** ప్రజా గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ వేద సాయిచందర్‌కు జిల్లా సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు. సిరిసిల్ల గాంధీచౌక్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ హాజరై మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో సాయిచంద్ తనదైన శైలిలో పోరాటం సాగించారన్నారు. ప్రజల గొంతుకై తెలంగాణ వాదాన్ని దశదిశలా వ్యాపింప జేశారని కొనియాడారు. సాయిచందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. సిరిసిల్లలో బీఎస్పీ నాయకులు, ముస్తాబాద్ అంబేద్కర్ విగ్రహం వద్ద, వేములవాడ సినారె కళామందిరంలో నృత్య కళానికేతన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీఎస్పీ సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి లింగంపల్లి మధుకర్, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు కాంపెల్లి శ్రీనివాస్, కళానికేతన్ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు యెల్ల పోశెట్టి, కళాకారులు బొడ్డు రాములు, సోమినేని బాలు, లక్ష్మీరాజం, సత్తయ్య, ప్రతాప్ పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



గ్రామస్తులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

**ముస్తాబాద్:** పరిసరాలను పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీవో రమాదేవి అన్నారు. ముస్తాబాద్ మండలంలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా శుక్రవారం డ్రై డే నిర్వహించారు. ముస్తాబాద్, గూడెం, ఆవునూర్, పోతుగల్, నామాపూర్ తదితర గ్రామాల్లో పంచాయతీరాజ్, వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలను పరిశీలించారు. లార్వా దోమ వృద్ధికాకుండా చూసుకోవాలని సూచించారు. సర్పంచులు, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

**వేములవాడఅర్బన్:** వేములవాడ మండలం అనుపురం గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా ప్రత్యేక అధికారి ఆకుల శ్రీనివాస్ పాఠశాల, అంగన్‌వాడీ, డ్రెయినేజీల, ఇంకుడు గుంతల నిర్వహణను పరిశీలించారు. గ్రామపంచాతీలోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు, డ్రెయినేజీని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండపల్లి వెంకటరమణారావు పాల్గొన్నారు.

**వీర్నపల్లి:** మండలంలో అన్ని గ్రామాల్లో శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీర్నపల్లిలో సర్పంచ్ పాటి దినాకర్, ఉపసర్పంచ్ రవి, గ్రామ ప్రత్యేక అధికారి శ్రీహరి పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి మొబైల్ ఠాణా దివస్

- చందుర్తి సీఐ కిరణ్‌కుమార్



ఫిర్యాదు స్వీకరిస్తున్న సీఐ కిరణ్‌కుమార్

**చందుర్తి:** ప్రజా సమస్యల పరిష్కారానికే మొబైల్ ఠాణా దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చందుర్తి సీఐ అచ్చ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని రామరావుపల్లె గ్రామంలో సీఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని భూసమస్యలతో పాటు పంట క్షేత్రాల వద్దకు దారుల కోసం 8 మంది ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీఐ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. శాంతియుత వాతావరణానికి అందరూ సహకరించాలన్నారు. ప్రజలు తమకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలన్నారు. లేనిపక్షంలో 100 డయల్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. మైనర్లకు, డ్రైవింగ్ లైసెన్స్ వారికి వాహనాలు ఇస్తే యాజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. యువకులు వాహనాలపై స్పీడ్‌గా వెళ్లడం తగ్గించుకోవాలన్నారు. స్పీడ్‌గా వెళ్లి ప్రమాదాలకు గురికావద్దన్నారు. కార్యక్రమంలో చందుర్తి ఎస్సై రమేశ్, సర్పంచ్ కమలాకర్‌రావు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అవినీతి పాలనను అంతమొందించాలి

- శక్తి కేంద్రాల ఇన్‌చార్జి నాగరాజు
- బూత్ కమిటీ సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు, బీజేపీ నాయకులు



మాట్లాడుతున్న బీజేపీ మండల విస్తారక్ శివ

**ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి:** రాష్ట్ర ప్రభుత్వ అవినీతి పాలనను అంతమొందించడానికి అందరూ సిద్ధం కావాలని, అందుకోసం ప్రజలను సంసిద్ధులను చేయాలని బీజేపీ తమిళనాడుకు చెందిన శక్తి కేంద్రాల ఇన్‌చార్జి నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మాట్లాడుతూ బీజేపీ అధిష్ఠానం పిలుపు మేరకు కార్యకర్తల బాగోగులు తెలుసుకున్నట్లు తెలిపారు. ప్రతి కార్యకర్త పార్టీ కోసం కృషి చేయాలన్నారు. ఎల్లారెడ్డిపేటలో బూత్ కమిటీలు శక్తి కేంద్రాలను బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, గుండాడి వెంకటరెడ్డి, కోనేటి సాయిలు, బంధారపు లక్ష్మారెడ్డి, నేవూరి దేవేందర్‌రెడ్డి, చందుపట్ల లక్ష్మారెడ్డి, మినహాజ్ ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి,

**వీర్నపల్లిలో..**

ప్రతీ బూతులో పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ మండల విస్తరక్ శివ సూచించారు. వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామంలో మేరా బూత్ సబ్ సే మాజ్‌బూత్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, అవినీతి పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వీర్నపల్లి బూత్ అధ్యక్షుడు మహేశ్, పీర్యా, శేఖర్, అంజనేయులు, చంద్రమౌళి, శ్రీబాబు, లక్పతి, లింబాద్రి, రవి, తిరుపతి, సతీశ్ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**సర్పంచ్‌కు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత**

**తంగళ్లపల్లి:** మండలంలోని అంకుషాపూర్ గ్రామ సర్పంచ్ కొయ్యడ ఎల్లవ్వ–నాంపల్లి దంపతులకు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పడిగెల మానస, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు ఆధ్వర్యంలో రూ.1.20 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. సర్పంచ్ దంపతుల కూతురు అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. కార్యక్రమంలో సర్పంచులు మాట్ల మధు, వలకొండ వేణుగోపాల రావు, ఉమ రాజు, బాలయ్య, ఎంపీటీసీలు కోడి అంతయ్య, ములిగె దుర్గాప్రసాద్, కుంటయ్య, నాయకులు పాల్గొన్నారు.

**వీర్నపల్లి:** మండల కేంద్రంలో శుక్రవారం నలుగురు లబ్ధిదారులకు బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కమటం నాగరాజు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మల్లారపు ఉషయ్యకు రూ.13,500,,గంగదారి వసంత్‌కు రూ.22,500, కరికే నర్సయ్యకు రూ.40 వేల, సయ్యద్ కరీంకు రూ.25 వేల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాటి దినాకర్, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, ఉపసర్పంచ్ బోయిని రవి, కో–ఆప్షన్ ఉస్మాన్, ఆల్ ఇండియా బంజారా సంఘం జిల్లా నాయకులు గుగులోత్ తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

**హద్దు రాళ్లు తొలగించాలని ఫిర్యాదు**

**బోయినపల్లి:** మండల గ్రామ తూర్పు చెరువు కట్టపై పాతిన హద్దు రాళ్లను తొలగించాలని బోయినపల్లి మాజీ సర్పంచ్ సంబ లక్ష్మీరాజం కరీంనగర్ ఇరిగేషన్ ఈఈకి శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూమిని కొనుగోలు చేసి పాత హద్దురాళ్లను తొలగించి చెరువు కట్టపై చొరబడి కొత్తగా హద్దు రాళ్లు వేసి భూమిని కబ్జా చేశారన్నారు. దాంతో అధికారులు స్పందించి ఎప్పటిలాగే పాత హద్దురాళ్లను ఏర్పాటు చేసి రియల్ వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

**విద్యార్థులకు జ్ఞాపికలు అందజేత**

**బోయినపల్లి:** మండలంలోని తెలంగాణ మోడల్ హైస్కూల్‌లో గత విద్య సంవత్సరం పదో తరగతిలో 9 జీపీఏ సాధించిన తొమ్మిది మంది విద్యార్థులకు చంద్రయ్య సార్ స్మారకార్థంగా జ్ఞాపికలు, డిక్షనరీలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, రామరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

**సర్పంచ్ భార్య మృతి**

**వేములవాడరూరల్:** మండలంలోని నూకలమర్రి గ్రామానికి చెందిన సర్పంచ్ పెండ్యాల తిరుపతి భార్య అరుణ మృతి చెందింది. కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె శుక్రవారం తెలవారుజామున మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న పలువురు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

**అన్నదానం**

**వేములవాడ:** మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్‌కు చెందిన డాక్టర్ పద్మజాదేవి, సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



పార్టీ జెండా ఎగురవేస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

**గంభీరావుపేట:** రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకువస్తారని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దమ్మన్నపేట, నాగంపేట, జగదాంబతండాలో శుక్రవారం నిర్వహించిన పార్టీ జెండా పండుగలో పాల్గొని జెండాను ఎగురవేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన సోనియా గాంధీ రుణం ఈసారి ప్రజలు తీర్చుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. సిరిసిల్ల నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని, ప్రజల సమస్యలు పట్టించుకోకుండా మంత్రి కేటీఆర్ పోలీస్ పహారాలో పర్యటిస్తున్నారన్నారు. రాష్ట్రంలో నియోజకవర్గంలో అవినీతి, అరాచక, నియంతృత్వ పరిపాలన కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండల శాఖల అధ్యక్షులు హమీద్, దొమ్మాటి నర్సయ్య, ఎంపీటీసీ పర్శరాములు, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్‌పాషా, నాయకులు లచ్చయ్య, నర్సింలు, యాదుల్లా, సంజీవరెడ్డి, సంతోష్‌గౌడ్, బలరాంరెడ్డి, విఠల్‌నాయక్, కిషన్‌గౌడ్, స్వామి, మహేశ్ పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ సన్మానం



ఉద్యోగ విరమణ పొందిన వారితో ఆర్టీసీ మేనేజర్

**వేములవాడఅర్బన్:** ఉద్యోగ విరమణ పొందిన వేములవాడ ఆర్టీసీ ఉద్యోగులు చందనం భూమయ్య, జనార్దన్, నయిమ్, రవీందర్, అంజయ్యను మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, డిపో మేనేజర్ మురళీకృష్ణ అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సంతోష్‌బాబు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

**స్వీపర్‌కు..**

**ముస్తాబాద్:** ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా మండలంలోని గూడెం ప్రాథమిక పాఠశాల స్వీపర్ కొమ్ము పర్శరాములు దంపతులను శుక్రవారం సన్మానించారు. సర్పంచ్ చిట్నేని సరిత, ఉపసర్పంచ్, ఎస్ఎంసీ చైర్మన్ శాడ శ్రీనివాస్, హెచ్ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ఆత్మీయ వీడ్కోలు**

**వేములవాడ:** వేములవాడ రాజన్న ఆలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న తాళ్లపల్లి దేవమ్మను రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్వామివారి ఓపెన్ స్లాబ్‌లో ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఏఈవో హరికిషన్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అరుణ్, వరి నర్సయ్య, ఉద్యోగుల సంఘం నాయకులు కూరగాయల శ్రీనివాస్, ఉద్యోగులు, అర్చకులు పాల్గొన్నారు.

**కోనరావుపేట:** ఉద్యోగ విరమణ సందర్భంగా మండలంలోని ధర్మారం ఎస్సీ హాస్టల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న పెంటయ్యను సన్మానించారు. కార్యక్రమానికి సర్పంచ్ గున్నాల అరుణ, ఎంపీపీ చంద్రయ్య, డీఎస్‌సీడీవో వినోద్‌కుమార్, వార్డెన్ శ్రీనివాస్, గున్నాల లక్ష్మణ్, వార్డు సభ్యులు తీగల వెంకన్న, బత్తుల రేఖ పాల్గొన్నారు.

## కులవివక్షను రూపుమాపాలి

- ఇల్లంతకుంట ఎస్సై రాజేశ్



మాట్లాడుతున్న ఎస్సై రాజేశ్

**ఇల్లంతకుంట:** కులవివక్షను రూపుమాపాలని ఎస్సై కొమురవెల్లి రాజేశ్ అన్నారు. మండలంలోని అనంతారం గ్రామంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల పట్ల అగ్రకులాల వారు కుల వివక్ష చూపొద్దని, కులవివక్ష చూపితే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కుల, మత భేదం లేకుండా ప్రజలందరూ కలిసి ఉండాలని అన్నారు. హోటల్‌లలో రెండు గ్లాసుల పద్ధతిని విడనాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారాయణ, ఎంపీటీసీ పుష్పలత, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ జిల్లా సభ్యుడు పసుల బాలరాజు, ఆర్ఐ షరీఫ్ పాల్గొన్నారు.

**వీర్నపల్లిలో..**

**వీర్నపల్లి:** మండల కేంద్రం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పాటి దినాకర్ అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపతహసీల్దార్ ఎలుసాని ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.

## బడిబాట ఏమైంది.?

- ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల పనితీరుపై పర్యవేక్షణ కరువు
- జలపతి తండాలో ఇద్దరు ఉపాధ్యాయులకు ఒక్కడే విద్యార్థి
- కిష్టంపేటలో ఐదుగురు టీచర్లున్నా విద్యార్థులు సున్నా



జలపతి తండా ప్రాథమిక పాఠశాలలో ఉన్న ఒకే విద్యార్థికి చదువు చెబుతున్న టీచర్

**చందుర్తి:** మారుమూల ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు తీరు అధ్వానంగా ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయులు హాజరు శాతాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు బయోమెట్రిక్ విధానంలో లోసుగులను ఆసరాగా చేసుకుని విధులకు డుమ్మా కొడుతున్నారన్న ఆరోపణలే వినిపిస్తున్నాయి. మండలంలోని జలపతి తండాలో ప్రాథమిక పాఠశాలలో ఒక్క విద్యార్థి ఉండగా ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. కానీ ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఇక్క ఉపాధ్యాయుడు లీవ్‌లో ఉన్నట్లు, అక్కడ విధులు నిర్వహిస్తున్న మరో ఉపాధ్యాయురాలు శ్రీలత తెలిపారు. కానీ తండావాసులు మాత్రం వంతుల వారీగా విధులకు గైర్హాజరవుతున్నారన్న ఆరోపిస్తున్నారు. దేవుని తండాలోని ప్రాథమిక పాఠశాలలో 18 మంది విద్యార్థులుండగా ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులు లీవ్‌లో ఉండడం గమనార్హం. శుక్రవారం మాత్రం ఆరుగురు విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యారు. మిగతా వారు పాఠశాలకు ఈ రోజే రాలేదని అక్కడే విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు తెలిపారు. కిష్టంపేట ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం ఆరో తరగతిలో 11మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం వారు వేరే పాఠశాలలో చేరడంతో పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు ఖాళీగానే ఉన్నారు. బడిబాట ముగిసే వరకు సర్దుబాటు చేపట్టకపోవడంతో విద్యార్థులు లేక పాఠశాలలో ఖాళీగా కూర్చున్నారు.

**ఎంఈవో వివరణ**

దేవుని, జలపతి తండా ఉపాధ్యాయులు అత్యవసర పనులపై లీవ్ పెట్టారు. వంతుల వారీగా విధులకు హాజరవుతున్నారని ఆరోపణలు అవాస్తవం. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేయాలని తెలిపాం. తరుచూ పాఠశాలలను తనిఖీ చేస్తున్నామని, జూలై 6న బడిబాట ముగుస్తుంది. సర్దుబాటులో విద్యార్థులు లేని పాఠశాలలో ఉపాధ్యాయులు ఎక్కువగా ఉంటే మిగతా పాఠశాలలకు డిప్యూటేషన్‌పై పంపుతామని ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్‌దీక్షితులు వివరించారు.